

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో స్వర్ణం

కొండపి (సింగరాయకొండ): కొండపి ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థి మేడిద సాంబశివ రావు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు.



కొండచిలువ కలకలం

పొదిలి రూరల్: మండలంలోని నందిపాలెంలో బుధవారం కోడిపిల్లలను తిన్న 10 అడుగుల కొండచిలువ ఉండటం స్థానికులు గుర్తించారు. దానిని అటవీ అధికారులకు అప్పగించారు.

గరిష్టం/కనిష్టం
27.4/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడతాయి.

న్యూస్‌రీల్

రేపు కంభంలో కలెక్టర్ స్పందన

కంభం: ఈనెల 17వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బృందావన కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శైలేంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

దర్శి: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా కేంద్రం అనుబంధ సంస్థ దర్శి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అగ్రిసెట్ లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచారు. విద్యార్థులైన మహానంది హర్షిణికి 37వ ర్యాంకు, నాగేశ్వరికి 80వ ర్యాంకు, ఎస్‌డీ హరీఫ్‌కు 124వ ర్యాంకు, వేము తేజస్వినికి 163వ ర్యాంకు, బ్యూలాకు 217 ర్యాంకు వచ్చింది. విద్యార్థులకు దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ బీ ప్రమీలా రాణి అభినందనలు తెలిపారు.

పెద్దదోర్నాల సబ్ డీఎఫ్‌ఓగా వేణు



ఆత్మకూరి వేణు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల సబ్ డీఎఫ్‌ఓగా ఆత్మకూరి వేణు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మార్కాపురం ఫారెస్టు రేంజి అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన సబ్ డీఎఫ్ఓగా పదోన్నతి పొందారు. గతంలో పెద్దదోర్నాల సబ్ డీఎఫ్ఓ గా బాధ్యతలు నిర్వహించిన సందీప్‌రెడ్డి కడప జిల్లాకు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లగా, ప్రస్తుతం ఆత్మకూరి వేణు సబ్ డీఎఫ్ఓగా బాధ్యతలు చేపట్టారు. వేణుకు కొర్రప్రోలు, దోర్నాల రేంజి అధికారులు ప్రసన్నజ్యోతి, విశ్వేశ్వరరావు అభినందనలు తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా నాగమణి ప్రమాణ స్వీకారం నేడు



త్రిపురాంతకం: యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్‌గా శింగారెడ్డి నాగమణి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నేడు వైఎస్సార్ సీపీకి చెందిన మంత్రులు, ప్రముఖులు హాజరవుతున్నారు. వీరి స్వాగత ఏర్పాట్లు భారీగా చేశారు. త్రిపురాంతకంలో ఈమేరకు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి భార్య నాగమణిని ప్రభుత్వం చైర్ పర్సన్‌గా నియమించింది. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన యాదవ్, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సభా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నేడు ఎంపీపీగా వెంకటయ్య అధికారిక ఎన్నిక



ఎంపీపీ అభ్యర్థి వెంకటయ్యకు బీ ఫారం అందజేస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: నేడు ఎంపీడీవో కార్యాలయంలో జరగనున్న పుల్లలచెరువు ఎంపీపీ ఎన్నిక సందర్భంగా యర్రగొండపాలెం లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఎంపీటీసీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీపీ అభ్యర్థిగా కందుల వెంకటయ్యను ఎంపిక చేసి పార్టీ బీ ఫారం అందజేశారు. సభ్యులంతా పార్టీ నిబంధనలకు లోబడేలా విప్ జారీ చేసే అధికారాన్ని మల్లాపాలెం ఎంపీటీసీ ఎల్ రాములుకు ఇస్తూ రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డి నుంచి అందిన నకలును మంత్రి సురేష్ రాములుకు అందచేశారు.

కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఎం, సుబ్బారెడ్డి, యంద్రపల్లిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాధికార శక్తి

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. నిరంతరం ఆదాయం పొందేలా చేయూతనిచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా వడ్డీలేని రుణాలు అందివ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలపై ఎలాంటి భారం పడకుండా రుణాలు చెల్లిస్తూ సొంతకాళ్లపై నిలబడేందుకు 'ఉన్నతి-మహిళా శక్తి' పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా ఆటోలు ఇవ్వనున్నారు. జిల్లాలో ఆటోల కోసం మొత్తం 15 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 13 మందిని ఎంపిక చేశారు.



- నిరంతర ఆదాయం కోసం జగనన్న వినూత్న పథకం
- ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీ లేకుండా ఆటోలకు రుణాలు
- 48 సులభ వాయిదాల్లో చెల్లించేలా నిబంధనలు
- జిల్లాలో 13 మంది ఎంపిక

ఒంగోలు టౌన్: తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబాన్ని పోషించేందుకు మహిళలు ఆటో డ్రైవర్ అవతారమెత్తాల్సి వస్తోంది. డ్రైవింగ్ నైపుణ్యం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేని కారణంగా అద్దెకు ఆటోలను తీసుకొని నడుపుకుంటున్నారు. ఆటో యజమానికి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటుగా ఆటోలకు ఏదైనా సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు దానికి మరమ్మతులు సైతం వారే చేయించుకోవాల్సి వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటో నడిపినప్పటికీ కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. పోనీ సొంతంగా ఆటో కొనుక్కోవాలంటే అందుకు ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె ఆటోలతో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. దీన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మహిళలకు 'ఉన్నతి-మహిళా శక్తి' పథకం ద్వారా సొంతంగా ఆటోలు ఇవ్వాలని నిర్ణయించింది. తొలి విడత రాష్ట్ర వ్యాపంగా 229 మంది ఎంపిక కాగా జిల్లా నుంచి 13 మంది మహిళలను ఎంపిక చేశారు.

వడ్డీ లేకుండా...

మహిళల ఆదాయాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. అక్కా చెల్లెమ్మల కోసం ఉన్నతి-మహిళా శక్తిని రూపొందించిన అధికారులు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చేందుకు సమాయత్తమయ్యారు. ఇందుకుగాను దరఖాస్తులను ఆహ్వానించి పలువురిని ఎంపిక చేశారు. లబ్ధిదారులు ఆటో కొనుగోలులో అయ్యే ఖర్చులో కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగతా 90 శాతం రుణం సెర్ప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ రుణానికి ఎలాంటి వడ్డీ ఉండదు. మొత్తం రుణాన్ని 48 సులభ వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇందుకోసం మహిళలకు తప్పనిసరిగా డ్రైవింగ్ వచ్చి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్వాక్రా సభ్యులకు మాత్రమే రుణాలు ఇస్తారు. జిల్లాలో ఎంపికైన 13 మంది లబ్ధిదారులకు ఇటీవల విజయవాడలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆటోలు ఎక్కువ కాలం మన్నడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయిల్ వినియోగంలో జాగ్రత్తలు, రోడ్డు మీద డ్రైవింగు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలను నిపుణులు వివరించారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యలను ఎలా రిపేర్లు చేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అంతే కాకుండా స్థానికంగా ట్రాన్స్‌పోర్టు అధికారులకు కూడా ప్రభుత్వం పలు సూచనలు చేసింది. లైసెన్సుల జారీల విషయంలో ఉన్నతి లబ్ధిదారులకు సహకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అంబేడ్కర్ వర్ధంతికి ఆటోల పంపిణీ...

ఉన్నతి పథకం కింద జిల్లాలోని ఒంగోలు మండలం నుంచి ఇద్దరు, నాగులుప్పలపాడు మండలం నుంచి నలుగురు, తాళ్లూరు నుంచి ఒకరు, పుల్లలచెరువు నుంచి ముగ్గురు, దొనకొండ, గిద్దలూరు, రాచర్ల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎంపికయ్యారు. ఎంపికకైన లబ్ధిదారులకు డిసెంబరు 6వ తేదీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి రోజు ఆటోలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వచ్చే ఏడాది ఏప్రిల్ 14న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మరికొంతమందిని ఎంపికచేసి ఆటోలు పంపిణీ చేయనున్నారు. మొత్తం మీద ప్రతి మండలంలోనూ ఈ ఆటోలను పంపిణీ చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వలక్ష్యం.

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్నీ విధాలుగా అనేక చర్యలు తీసుకుంటోంది. పేదరికం నుంచి విముక్తి కోసం మహిళకు అండగా నిలుస్తుంది. పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన మౌలిక వసతులు, ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని తమకు అనుగుణంగా మార్చుకొని గ్రామీణ మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలి. ఇందులో భాగంగానే ఉన్నతి పథకానికి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు. మహిళలు తమ శక్తిని నిరూపించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– తేళ్ల రవికుమార్, పీడీ, డీఆర్డీఏ

జగనన్న ఇస్తున్న సహకారం మరిచిపోలేను



నేను 8 వ తరగతి వరకు చదువుకున్నాను. నా భర్త బేల్దారు పనులు చేస్తూనే మరింత ఆదాయం కోసం ఆటో వేస్తుంటారు. మాకు ఇద్దరు సంతానం. వారి ఉన్నతి కోసం కష్టపడాలని నిర్ణయించుకున్నాను. అందుకే నాభర్తకు తోడుగా నేను కూడా ఆటో నడపాలని, కుటుంబం కోసం ఇద్దరం కలిసి కష్ట పడాలనుకుంటున్నాను. అందుకే నేను ఉన్నతి పథకంలో ఆటో కోసం రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు రుణం మంజూరు చేయడమే కాకుండా విజయవాడలో డ్రైవింగ్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. నాకు జగనన్న కాలనీలో ఇల్లు కూడా వచ్చింది. పేద మధ్య తరగతి ప్రజల కోసం జగనన్న ఇస్తున్న సహకారం ఎన్నటికీ మరిచిపోలేం.

– దేవరపల్లి జెస్సి ప్రియ, కరవది

17న వై.పాలెంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు

ఒంగోలు: దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయార్థం అవసరమైన ఉపకరణాలను ఈనెల 17న యర్రగొండపాలెంలో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అలిమ్‌కో సారథ్యంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో వీల్ చైర్లు, ట్రైసైకిల్స్, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్స్, చంక కర్రలు, అంధుల చేతి కర్రలు, శ్రవణ యంత్రాలు తదితర ఉపకరణాలను ఉచితంగా మంజూరుకు అర్హులను ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అవసరమైన దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటలకు వై.పాలెంలోని అంబేడ్కర్ భవనానికి ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆదాయం సర్టిఫికెట్, ఫొటోలు తీసుకురావాలన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పొదిలి: పృదులాపురి గ్రామంలో వేంచేసిన పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం హనుమంత వాహన సేవ జరిగింది. ఉభయదాతలు వరికుంట్ల అనిల్‌కుమార్, లక్ష్మీ సురేఖ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దంపతులను మేళతాళాలతో ఆహ్వానించారు. హోమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మురళిచార్యులు, గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి పెరుమాళ్ల భాస్కరరావు, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు, వెలిశెట్టి నారాయణ, సామి రాజా తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

27 నుంచి కుల గణన సర్వే



కుల గణన సర్వేపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కుల సంఘాలు, మత పెద్దలు సహకరించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో వివిధ సామాజికవర్గాలకు సంబంధించిన వివరాలను కచ్చితమైన గణాంకాలతో సేకరించేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి కుల గణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సర్వేపై బుధవారం ప్రకాశం భవనంలో అధికారులు, కుల సంఘాలు, మత పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కుల గణన సర్వే ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో యంత్రాంగానికి కుల సంఘాలు, మత పెద్దల సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఆయా వర్గాల వారికి మరింత మెరుగ్గా అందేలా విధాన పరమైన నిర్ణయం తీసుకునేందుకు ఈ సర్వే ఉపకరిస్తుందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. ఈ సర్వేపై కుల సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుల సంఘాలు, మత పెద్దలకు ఈ సర్వేపై ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేయడంతో పాటు సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుల గణనను ఆధారంగా చేసుకుని కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయబోమన్నారు. ఇప్పటి వరకు వర్తిస్తున్న సంక్షేమ పథకాలు ఏవీ తొలగింపబడవన్నారు. సర్వే వివరాలు లీక్ కావని, మొబైల్ యాప్‌లో నమోదు చేయగానే అవి మొత్తం అప్పటికప్పుడే ప్రభుత్వ డేటా బేస్‌లో భద్రపరుస్తారన్నారు.

వివిధ కుల సంఘాలు, మత పెద్దలు మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో తొలిసారి కుల గణన సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయమన్నారు. కులాల వివరాలతో పాటు ప్రజల ఆస్తులు, ఇతర సమాచారాన్ని కూడా నమోదు చేయాలన్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు వలస వెళ్లిన గిరిజన జాతుల వివరాలను కూడా ఈ సర్వేలో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ముస్లింల్లోని దూదేకులను కొన్ని చోట్ల ఓసీ కులస్తులుగా నమోదు చేస్తున్నారని, కులాలతో పాటు వృత్తి వివరాలు కూడా సేకరించాలని కోరారు. బలహీన వర్గాల కులాల పేరుతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని సచివాలయాలను యాదృశ్చికంగా ఎంపిక చేసి సర్వే జరుగుతున్న తీరును కూడా వ్యక్తిగతంగా పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి సురేష్‌కన్నా, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- పార్టీ నాయకులు, కార్యకర్తలకు బాలినేని పిలుపు

ఒంగోలు: ఈనెల 21న ఒంగోలులో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక తన నివాసంలో ఒంగోలు నగర పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో వారికి జరిగిన న్యాయాన్ని వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా జరిగే యాత్ర ఈనెల 21న ఒంగోలుకు వస్తుందని, జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొని విజయంతం చేయాలన్నారు. ప్రతి డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్ సంయుక్తంగా వారి పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలుపుకుని లబ్ధిదారులతోపాటు ప్రజలను చైతన్యం చేసి పార్టీ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలన్నారు. నిజాయతీగా వ్యవహరిస్తున్నా నిందలు వేయడమే పనిగా ప్రతిపక్ష పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని, తాను మాత్రం నిజాయతీనే నమ్ముకుని ముందుకు సాగుతానన్నారు. గత 15 సంవత్సరాలుగా నకిలీ దస్తావేజుల ప్రక్రియ కొనసాగుతోందని, వెలుగులోకి రాగానే ప్రత్యేకంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమును సైతం వేయించిన ఏకైక ఎమ్మెల్యేను తాను మాత్రమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా నిజాయతీతోనే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్ పర్సన్ సింగరాజు మీనాకుమారి, నగర కన్వీనర్ కటారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, 3వ క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రాము, ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, డివిజన్ కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమీషన్ తీసుకుని.. నాపై అబద్ధాలా..

- జనార్దన్ వ్యాఖ్యలపై బాలినేని ఆగ్రహం
- బకింగ్‌హాం బ్రిడ్జి పనులపై జనార్దన్ చెప్పేవన్నీ అవాస్తవాలు
- ఏ గుళ్లోకైనా రండి ప్రమాణం చేద్దాం
- రూ.40 లక్షల మెటీరియల్ తోలించి రోడ్డు వేసి రవాణాకు ఇబ్బంది లేకుండా చేశా
- ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న బాలినేని



విలేకర్లతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: బకింగ్‌హామ్ బ్రిడ్జి పనుల్లో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కమీషన్ తను తీసుకుని తాను తీసుకున్నానని అబద్ధాలు చెప్పడం ఎంతవరకు న్యాయమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కొత్తపట్నంలో రూ.2.75 కోట్లతో డబుల్ రోడ్డు శంకుస్థాపన అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బకింగ్‌హామ్ బ్రిడ్జి కేంద్రం నుంచి వచ్చిన నిధులతో నిర్మిస్తున్నారన్నారు. 2018 నాటికి పూర్తి చేయాలని అగ్రిమెంట్ ఉందని, ఆ లోపు పూర్తి చేయకపోవటంతో కేంద్ర ప్రభుత్వం ఆ స్కీమ్ రద్దు చేసిందని చెప్పారు. వారు చేసిన తప్పు చెప్పకుండా తాను కమీషన్ తీసుకున్నానని, పనులు చేయలేదని అబద్ధాలు చెబుతున్నారన్నారు. అప్పటికి రూ.8 కోట్లతో 40 శాతం పనులు మాత్రమే చేశారని.. తాను వచ్చిన తరువాత రూ.9 కోట్లతో 40 శాతం పనులు జరిగాయన్నారు. ఇప్పుడు జనార్దన్ 80 శాతం చేశానని, 20 శాతం కూడా చేయలేదని అబద్ధాలు చెప్పడం ఎంత అన్యాయమన్నారు. కావాలని ఆ కాంట్రాక్టర్ పనులు ఆపేస్తే సొంత డబ్బులు రూ.40 లక్షలు పెట్టి మెటీరియల్ తోలించి మెటల్ వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తే నా మీద అసత్య ఆరోపణలు చేయటం ఎంత వరకు సబబని మండిపడ్డారు. నిజం ఏమిటో ఏ గుళ్లోనైనా ప్రమాణం చేద్దామని సవాల్ విసిరారు. ఈ నెల 21న సామాజిక సాధికార బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మండల నాయకులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెలలోనే ఒంగోలులోనే 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరుతానని హామీ ఇచ్చారు. కొత్తపట్నం, ఒంగోలు మండలంలో కూడా కొన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి కూడా రూ.7 కోట్లు కావాలని చెప్పానని, అవి కూడా అయిపోతాయన్నారు. రెండు నెలల్లో రోడ్లు, ఇళ్ల పట్టాలన్నీ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఒంగోలులో రెండు చోట్ల స్థలాలు తీసుకున్నామని, పెద్ద సిటీగా చేస్తామని వివరించారు.

జనార్దన్ కంటే ఎక్కువే చేశాం:

మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కంటే ఎక్కువే అభివృద్ధి పనులు చేశామని బాలినేని శ్రీనివాసరెడ్డి వివరించారు. మండలంలో 15 పంచాయతీలకు రూ.20 కోట్లతో ఎప్పటి నుంచో తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు, వైర్లు మార్చి ఆధునికీకరణ చేశామన్నారు. రూ.20 కోట్లతో 132/33 సబ్ స్టేషన్ పూర్తి చేసే దశలో ఉందని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.8.90 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. రూ.400 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌కు త్వరలో సీఎం చేతుల మీద శంకుస్థాపన జరుగుతుందని వివరించారు. ఉలిచి చెక్ డ్యామ్ నిర్మించామని, ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఆధునికీకరణ చేసినట్లు తెలిపారు. ఒంగోలు హైటెన్షన్ విద్యుత్ వైర్లు మార్చినట్లు వివరించారు.

భూ ఆక్రమణ చేసే వారిని అరెస్టు చేయాలి:

భూ ఆక్రమణ చేసే ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలని తాను చెప్పానని తెలిపారు. ఎవరైతే ఆరోపణ చేశారో వారు వచ్చి కేసు పెట్టడం లేదంటే.. వారిది కూడా తప్పు ఉన్నట్లేనన్నారు. రూ.50 కోట్ల ఆస్తి ఉంటే ఎందుకు కేసు పెట్టడం లేదో అర్థం కావటం లేదన్నారు. కంప్లైంట్ ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేస్తామన్నారు. తాను ఒంగోలులో ఉన్నంత కాలం భూ ఆక్రమణలు జరగకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, గొర్రిపాటి శ్రీను, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంటవానిపల్లి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



జీవో పత్రాన్ని నాయకులకు అందజేస్తున్న మంత్రి సురేష్

- రూ.270 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- జీ.ఓ పత్రాన్ని గ్రామస్తులకు అందజేసిన మంత్రి సురేష్

పెద్దదోర్నాల: గంటవానిపల్లి గ్రామస్తుల చిరకాల స్వప్నమైన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన పరిపాలన అనుమతుల జీ.ఓ పత్రాన్ని గ్రామ సర్పంచ్ యక్కంటి రమాదేవి వెంకటేశ్వరరెడ్డికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం అందజేశారు. యర్రగొండపాలెంలోని మంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కర్నూలు, గుంటూరు రహదారి నుంచి తీగలేరు మీదుగా గంటవానిపల్లి గ్రామానికి నిర్మించే ఈ బ్రిడ్జికి సంబంధించి రూ.270 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ నంబర్ 763 పత్రాన్ని సర్పంచ్‌తో పాటు గ్రామ నాయకులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సింగంశెట్టి బాలవెంకటేశ్వర్లు, నడిపి రాములు, బొటుకు లక్ష్మయ్య, దొందేటి వెంకటేశ్వరరెడ్డి, సింగంశెట్టి నడిపి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

● ఉప రవాణా కమిషనర్‌ సుశీల

ఒంగోలు సెంట్రల్‌: విద్యార్థులు, వాహనదారులు రహదారి భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని ఉప రవాణా కమిషనర్‌ సుశీల సూచించారు. బుధవారం ఒంగోలులోని హర్షిణి కళాశాలలో విద్యార్థులకు సంస్థ చైర్మన్‌ రవికుమార్‌ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు, సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. జీవితం చాలా విలువైనదని, తాత్కాలిక ఆనందం కోసం భద్రతను పాటించకుండా ముప్పు తెచ్చుకోవద్దని చెప్పారు. ఎంవీఐలు కిరణ్‌ ప్రభాకర్‌, రామచంద్రరావు, ఎల్‌.సురేంద్ర ప్రసాద్‌, ఎస్‌.జగదీష్‌, కె.జయప్రకాశ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు ఓవర్‌ స్పీడ్‌తో వెళ్లడం, ట్రిపుల్‌ రైడింగ్‌, ఛేజింగ్‌లు మానుకోవాలని హితవు పలికారు. డ్రైవింగ్‌ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని, వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్‌ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్‌ శ్రీనివాసరెడ్డి, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన జేఎన్‌టీయూకే సెంట్రల్‌ జోన్‌ పోటీలు

● వివిధ పోటీల్లో విజేతలకు ట్రోఫీ, ప్రశంస పత్రాలు అందజేత
● సౌత్‌ జోన్‌ ఇంటర్‌ వర్సిటీ టోర్నీకి కబడ్డీ జట్టు ఎంపిక



సౌత్‌జోన్‌ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు



ట్రోఫీతో టెన్నిస్‌ విజేత జేఎన్‌టీయూకే టీమ్‌

ఒంగోలు: స్థానిక రైజ్‌ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ వేదికగా రెండు రోజులపాటు నిర్వహించిన కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్‌ జోన్‌ పోటీలు విజయవంతంగా ముగిశాయని కాలేజీ కార్యదర్శి శిద్దా హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ పరిధిలోని 37 కాలేజీల నుంచి విద్యార్థినీ విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కాలేజీ వైస్‌ చైర్మన్‌ శిద్దా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. క్రీడలపై విద్యార్థులకు ఉన్న ఆసక్తి, వారు ప్రదర్శించిన క్రీడా స్ఫూర్తిని అభినందిస్తున్నానన్నారు. కబడ్డీ బాలికల విభాగంలో గుడ్లవల్లేరు, చదరంగం బాలుర విభాగంలో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్‌, చదరంగం బాలికల విభాగంలో శ్రీవిష్ణు ఫర్‌ ఉమెన్‌ భీమవరం, టెన్నిస్‌ బాలుర విభాగంలో కాకినాడ జేఎన్‌టీయూ, టెన్నిస్‌ బాలికల విభాగంలో రైజ్‌ కృష్ణసాయి ప్రకాశం విద్యార్థులు విజేతలుగా నిలిచారని కాలేజీ డైరెక్టర్‌ డాక్టర్‌ ఏవీ భాస్కరరావు వెల్లడించారు. విజేతలకు కాలేజీ సెక్రేటరీ శిద్దా హనుమంతరావు, వైస్‌ చైర్మన్‌ శిద్దా సూర్యప్రకాశరావు చేతులమీదుగా ట్రోఫీలు, ప్రశంస పత్రాలు అందించారు. అళగప్ప యూనివర్సిటీలో సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ జేఎన్‌టీయూ కాకినాడ తరఫున కబడ్డీ బాలికల విభాగంలో ఆడేందుకు 15 మందితో కూడిన జట్టును ఎంపిక చేయగా రైజ్‌ కాలేజీ నుంచి ఎస్‌.నందిని, ఎ.జాహ్నవికి చోటుదక్కింది. సెంట్రల్‌ జోన్‌ పోటీల నిర్వహణ తొలిసారి అయినప్పటికీ ఏర్పాట్లు బాగున్నాయని రైజ్‌ యాజమాన్యాన్ని పలువురు ఫిజికల్‌ డైరెక్టర్లు ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్‌ కేవీ సుబ్రహ్మణ్యం, రైజ్‌ కాలేజీ ఫిజికల్‌ డైరెక్టర్లు ఎస్‌.హిమచంద్రబాబు, ఎస్‌.సుబ్బారావు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.2.75 కోట్లతో డబల్‌ రోడ్డుకు భూమి పూజ



రూ.2.75 కోట్లతో శంకుస్థాపన చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామం మార్కెట్‌ యార్డ్‌ నుంచి కె.పల్లెపాలెం బీచ్‌ వరకు డబుల్‌ రోడ్డుకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఆయనతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.2.75 కోట్లతో శిలాఫలకాన్ని రిబ్బన్‌ కట్‌ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌ యార్డ్‌ నుంచి కె.పల్లెపాలెం బీచ్‌ వరకు రోడ్డు నిర్మిస్తున్నారని, రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఒంగోలు నగరం నుంచి బీచ్‌కు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు అటువంటి సమస్య ఉండదన్నారు. కొత్తపట్నంలో 500 మీటర్ల సిమెంట్‌ రోడ్డు, కె.పల్లెపాలెంలో 200 మీటర్ల సిమెంట్‌ రోడ్డు, మిగతా 2, 5 కిలో మీటర్ల తారు రోడ్డు వేస్తారన్నారు. డిసెంబర్‌ నెలాఖరుకు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్‌ అడ్వైజరీ బోర్డు చైర్మన్‌ ఆళ్ల రవీంద్రరెడ్డి, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ వాయల సుమతి, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ కె.గోపీచంద్‌ నాయక్‌, డీఈ ఎస్‌ అరుణకుమారి, కాంట్రాక్టర్‌ సాహుల్‌, సీహెచ్‌ శ్రీకాంత్‌, వీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీన్‌ దయాల్‌ స్పర్శ్‌ యోజనకు భారీ స్పందన

● ఎంపికైన విద్యార్థులను రెండో దశకు పంపాలి
● జిల్లా పోస్టల్‌ సీనియర్‌ సూపరిండెంట్‌ హరిప్రసాద్‌శర్మ



హరిప్రసాద్‌శర్మ

ఒంగోలు సెంట్రల్‌: దీన దయాల్‌ స్పర్శ్‌ యోజన పోటీ పరీక్షలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని జిల్లా పోస్టల్‌ శాఖ సీనియర్‌ సూపరిండెంట్‌ హరిప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పోటీ పరీక్షకు ఆంధ్రప్రదేశ్‌ నుంచి 6,384 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో ప్రకాశం పోస్టల్‌ డివిజన్‌ నుంచి 484 మంది ప్రాతినిధ్యం వహించాలరని చెప్పారు. మొదటి దశ ఫలితాల్లో రాష్ట్రం నుంచి ఎంపికైన 173 మందిలో ప్రకాశం పోస్టల్‌ డివిజన్‌ నుంచి 26 మంది ఉండటం సంతోషకరమన్నారు. రెండో దశ పోటీలకు ఎంపికైన 26 మంది విద్యార్థులు సేకరణ అధ్యయనం (ఫిలా టెలి) స్టాంప్స్‌పై ఒక ప్రాజెక్టును రూపొందించి ఈనెల 30వ తేదీలోగా చీఫ్‌ పోస్ట్‌మాస్టర్‌, జనరల్‌ ఆఫీస్‌, ఆంధ్ర ప్రదేశ్‌ సర్కిల్‌, విజయవాడకు రిజిస్టర్‌ లేదా స్పీడ్‌ పోస్ట్‌ ద్వారా పంపాలని సూచించారు. 6, 7వ తరగతి విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌గా తెలుగు సినిమా, యోగా ఫర్‌ హెల్త్‌, ఇండియన్‌ ఫ్రీడమ్‌ ఫైటర్స్‌, 8, 9వ తరగతి విద్యార్థులకు ఇస్రో, ట్రెడిషనల్‌ ఫుడ్స్‌ ఆఫ్‌ ఇండియా, స్పోర్ట్స్‌ వరల్డ్‌ చాంపియన్స్‌ ఫ్రమ్‌ ఇండియా ప్రాజెక్టులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ఎంపికైన విద్యార్థులకు దీన్‌ దయాల్‌ స్పర్శ్‌ యోజన స్కాలర్‌ షిప్‌ ప్రోత్రాహకంగా ఏడాదికి రూ.6 వేల చొప్పున నగదు అందించనున్నట్లు వెల్లడించారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో యువతది కీలక పాత్ర

● కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు: ప్రజా స్వామ్య ప్రభుత్వంలో యువత కీలక పాత్ర పోషించాలని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ సూచించారు. బుధవారం స్థానిక క్విస్‌ ఇంజినీరింగ్‌ కాలేజీలో యువతకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకోసం ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. పాలకులుగా ఎవరు ఉండాలో నిర్ణయించే అధికారం ఓటర్లకు రాజ్యాంగం కల్పించిందని, అందులో భాగంగానే ఐదేళ్లకు ఓసారి ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను యువత గమనిస్తూ ఉండాలని చెప్పారు. తమ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారు ఉంటే వారికి కూడా ఈ విషయాలు తెలియజేయాలని కోరారు. 18 ఏళ్లు పూర్తికాబోతున్న వారు కూడా ప్రొస్పెక్టివ్‌గా ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని పేర్కొన్నారు. ఆర్డీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్‌ మురళి, కాలేజీ ప్రిన్సిపాల్‌ వై.హనుమంతరావు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

జనవరి 5న తుది ఓటర్ల జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

● పారదర్శక ఓటరు జాబితా ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి
● కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ స్పష్టం చేశారు. బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మరణించిన ఓటర్లు, డబుల్‌ ఓట్ల తొలగింపు, ఇతర మార్పుచేర్పులు, ఓటుకు ఆధార్‌ అనుసంధానం చేసేందుకు బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి జిల్లాలో 90 వేలకు పైగా ఫారంలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ఎలక్షన్‌ విభాగం సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్‌, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్‌, స్వరూప్‌, రసూల్‌, సత్యం, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి



చీమకుర్తి కొత్తకుమ్మరిపాలెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌

చీమకుర్తి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తిలోని కొత్తకుమ్మరిపాలెం సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్‌ జగన్‌ కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. సీఎం వైఎస్‌ జగన్‌ గత నాలుగున్నరేళ్లుగా పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన నచ్చితేనే వైఎస్సార్‌ సీపీకి మద్దతిచ్చి ఫ్యాన్‌ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ జమానాలో ప్రజలకు ఏం చేశారు, సీఎం వైఎస్‌ జగన్‌ పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు ఎలా ఉందో ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లను ఇంటింటికీ తిరిగి అందజేశారు. అనంతరం వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ బాపతు వెంకటరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్‌ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మాజీ చైర్మన్‌ చల్లా అంకులు, కమిషనర్‌ ఫజులుల్లా, స్థానిక కౌన్సిలర్లు మేకల సులోచన యల్లయ్య, ఆముదాల ప్రమీల రామబ్రహ్మం, మంచా హరికృష్ణ, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ

పథకాలను పక్కాగా అమలు చేయాలి

● కలెక్టర్‌ దినేష్‌కుమార్‌



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ స్పష్టం చేశారు. బుధవారం ప్రకాశం భవనం నుంచి మండలాల సీసీలు, ఏపీఎంలు, వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పథకాల అమలులో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త యూనిట్లకు ఆసక్తి ఉన్న ఆరు వేల మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు వారి నుంచి డాక్యుమెంట్లు సేకరించాలన్నారు. 25లోగా డీపీఆర్‌ పూర్తి చేయాలని ఆదేశించారు. 30లోగా డీబీసీ మంజూరు తీసుకోవాలన్నారు. 30 నుంచి జనవరి 20లోపు అన్ని యూనిట్లు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్‌ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిలో 1700 యూనిట్లను జగనన్న పాలవెల్లువకు సంబంధించి వన్‌ ప్లస్‌ వన్‌ యూనిట్‌ కింద గుర్తించినట్లు తెలిపారు. మిగిలినవి నాన్‌ఫామ్‌ యూనిట్లని అన్నారు. డీఆర్‌డీఏ పీడీ రవికుమార్‌, డీపీఎంలు డేవిడ్‌, సుబ్బారావు, స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్‌, చేయూత డీపీఎం రాంబాబు, ఉన్నతి కో ఆర్డినేటర్‌ శ్రీనివాసప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా-ఆస్ట్రేలియా మ్యాచ్‌ సెక్యూరిటీ
కమిటీ మెంబర్‌గా వెంకటాద్రిరెడ్డి



ఎం.వెంకటాద్రిరెడ్డి

ఒంగోలు: ఇండియా-ఆస్ట్రేలియా మధ్య జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు సెక్యూరిటీ అండ్‌ ట్రాఫిక్‌ కమిటీ మెంబర్‌గా ఒంగోలుకు చెందిన ఎం.వెంకటాద్రిరెడ్డి నియమితులయ్యారు. ఈ మ్యాచ్‌ ఈనెల 23న విశాఖలోని డాక్టర్‌ వైఎస్సార్‌ ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ స్టేడియంలో నిర్వహించనున్నారు.

అర్ధరాత్రి వేళ ప్రసవ 'వేదన'!

● ప్రాణాపాయ స్థితిలో సింగరాయకొండ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గర్భిణి
● సుఖ ప్రసవం చేయడంతో తల్లీబిడ్డ సురక్షితం



తల్లీబిడ్డలతో డాక్టర్‌ వంశీధర్‌

సింగరాయకొండ: పురిటి నొప్పులతో ప్రాణాలు అరచేత పట్టుకుని సింగరాయకొండ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గర్భిణికి అక్కడి వైద్యుడు సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డల ప్రాణాలు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. అది సోమరాజుపల్లి పంచాయతీలోని అప్పాపురం ఎస్టీ కాలనీ. సింగరాయకొండ మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉంటుంది. కాలనీకి చెందిన యానాది సామాజికవర్గం మహిళ సీహెచ్‌ నాగేంద్రంకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వేళ సింగరాయకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇంతలోనే సోమరాజుపల్లి వద్ద ఉండే రైల్వే గేటు మూతపడింది. సుమారు గంటపాటు రైల్వే గేటు తెరుచుకోలేదు. ఆస్పత్రికి వెళ్లేందుకు గేటు తెరవండని గార్డును అడిగితే ఏమనుకుంటారోనన్న ఆందోళనతో అలాగే మిన్నకుండిపోయారు. 108 వాహనానికి ఫోన్‌ చేయాలన్న ఆలోచన కూడా వారికి లేదు. వాస్తవానికి వారు ఇంటి నుంచి బయలుదేరే సమయానికే ఆమెకు ఉమ్మనీరు పడిపోయింది. రైల్వే గేటు తెరుచుకున్న వెంటనే హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్‌ వంశీధర్‌.. బిడ్డ మెడకు పేగు చుట్టుకుందని గ్రహించి వైద్యం ప్రారంభించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెకు సకాలంలో చికిత్స చేసి నర్స్‌ రాణి సహాయంతో ఆపరేషన్‌ లేకుండానే ప్రసవం చేశారు. నాగేంద్రం ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించామని, ప్రస్తుతం పాప ఆరోగ్యంగానే ఉందని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వేళల్లో వైద్యులు అందుబాటులో ఉంటారని, సేవలను వినియోగించుకోవాలని డాక్టర్‌ వంశీధర్‌ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

దేశ ఆర్థిక ప్రగతిలో సొసైటీలు కీలకం



డీసీఓ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న చైర్మన్‌ తాతా బద్రీనాథ్‌

ఒంగోలు సిటీ/ఒంగోలు రూరల్‌: దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార రంగం ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని సూపర్‌బజార్‌ చైర్మన్‌ తాతా బద్రీనాథ్‌ పేర్కొన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా బుధవారం ఒంగోలు కోఆపరేటివ్‌ సెంట్రల్‌ స్టోర్స్‌ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. విశిష్ట అతిథి జిల్లా డీసీఓ పోలిశెట్టి రాజశేఖర్‌ మాట్లాడుతూ.. ఒంగోలు కోఆపరేటివ్‌ సెంట్రల్‌ స్టోర్స్‌ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. అనంతరం డీసీఓను చైర్మన్‌ బద్రీనాథ్‌ ఘనంగా సన్మానించారు. డివిజనల్‌ కోఆపరేటివ్‌ ఆఫీసర్‌ కందుల వెంకటేశ్వరరెడ్డి, ఎండీ జి.కుమార్‌, సహకార శాఖ ఉద్యోగులు, స్టోర్స్‌ సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

■ ఒంగోలు రూరల్‌ మండలంలోని కరవది సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌ వాకా వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన సహకార వారోత్సవాలు నిర్వహించారు. డివిజనల్‌ కో-ఆపరేటివ్‌ అధికారి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సహకార సంస్థలు లాభాలు పొందడమే కాకుండా పరపతేతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దుస్తుల షాపులు, కిరాణా దుకాణాలు, పెట్రోల్‌ బంకుల ఏర్పాటుకు సహకరించాలని చెప్పారు. నాణ్యమైన ధాన్యం, శనగలు సేకరించడమే కాకుండా, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుని వరుసగా రెండేళ్లపాటు జిల్లా స్థాయిలో ఉత్తమ సొసైటీగా సహకార మంత్రి నుంచి అవార్డు పొందడం అభినందనీయమన్నారు. సహకార శాఖ అధికారులు జి.కుమార్‌, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.